మరపురాని మహానేత వైఎస్సార్

• దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: మరపురాని మహానేత వైఎస్సార్(వైఎస్ రాజశేఖర్‌రెడ్డి) అని, ఆయన తన సేవలతో ప్రజల గుండెల్లో గుడికట్టుకుని అమరుడై ఉన్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన పలువురు పేదలకు వస్త్రదానం చేసి, కాసేపు మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలకు అండగా రాజశేఖర్‌రెడ్డి నిలిచారని, ఆయన ప్రవేశపెట్టిన 108 అంబులెన్స్, ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాలు ఇప్పటికీ ప్రజలు మర్చిపోవడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, రైతుల రుణమాఫీ చేశారన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేతగా పేరు తెచ్చుకున్నారన్నారు. జలయజ్ఞం ద్వారా వేలాది ఎకరాల భూములను సస్యశ్యామలం చేసిన ఘనత ఆయనదేనన్నారు. వ్యవసాయం దండగని అప్పట్లో చంద్రబాబు అంటే అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ వ్యవసాయాన్ని పండగలా మార్చారన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా తండ్రి బాటలో పయనిస్తూ అన్ని వర్గాల ప్రజల మనసులను గెలుచుకుంటున్నారన్నారు. రైతులకు రైతు భరోసా పథకం కింద సాగు సాయం అందజేస్తూనే, మరోవైపు 9 గంటల ఉచిత విద్యుత్ అందజేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు పువ్వల ఈశ్వరమ్మ, రెడ్డి పద్మావతి, జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, గొర్లె జగన్‌మోహన్, జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మామిడిపల్లి, బాగువలస, తోణాం గ్రామాల్లో కూడా వైఎస్సార్ వర్ధంతి నిర్వహించి, మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ప్రజల గుండెల్లో ఆయనది చిరస్థాయి స్థానం..

పార్వతీపురంటౌన్: ప్రజల గుండెల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్థానం చిరస్థాయిగా నిలిచి ఉందని, అలాంటి మహానేతను మరెన్నడూ చూడలేమని ఎమ్మెల్యే అలజంగి జోగారవు కొనియాడారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద వైఎస్సార్ 14వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అక్కడి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన రాష్ట్రానికి చేసిన సేవలను ప్రశంసించారు. ఆయన మన నుంచి దూరమై 13 ఏళ్లు పూర్తవుతున్నా ఆయనను ఎవరూ మర్చిపోలేదన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా పనిచేసిన ఐదేళ్ల మూడు నెలల కాలంలోనే ప్రజలు నిరంతరం గుర్తుంచుకునే పథకాలను ప్రవేశపెట్టి, అమలు చేశారన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ ద్వారా ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా చేశారని, జలయజ్ఞం ద్వారా రైతులకు సాగునీరు అందించారని, ఆరోగ్య శ్రీ ద్వారా ఎంతోమంది ప్రాణాలు నిలబెట్టారన్నారు. ఇప్పుడు ఆయన బాటలోనే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ప్రజలు తనను మెచ్చుకునేలా పాలన కొనసాగిస్తున్నారన్నారు. తన నాలుగున్నరేళ్ల పాలన కాలంలో మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి, రికార్డు సృష్టించారన్నారు. అనంతరం పేదలకు అన్నదానం, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీమవరపు కృష్ణ, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, కొండపల్లి బాలకృష్ణ, మూడు మండలాల జెడ్పీటీసీలు, బలగ రేవతమ్మ, మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట: మండలంలోని అరసాడ, బలిజిపేట తదితర ప్రాంతాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి శనివారం నిర్వహించారు. అరసాడలో జరిగిన కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పాల్గొని, వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. బలిజిపేటలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రాఘులత, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, మండల పార్టీ అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం వారు వైఎస్సార్ పాలనలో ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు.

పాచిపెంట: మండల కేంద్రంతో పాటు మండలంలోని గురువునాయుడుపేటలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వర్ధంతి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. గురువునాయుడుపేట జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఎంపీపీ ప్రతినిధి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కోరిపల్లి రవీంద్రనాథ్, యువజన విభాగం అధ్యక్షుడు శనపతి నారాయణరావు, ఎంపీటీసీలు మాదల సత్యవతి, కాదన అన్నపూర్ణ పాల్గొనగా, మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి డోల బాబ్జీ, వైస్ ఎంపీపీ నారాయణ, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్తమామిడి పార్వతి, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని పెదంకలాం, లచ్చయ్యపేట, బూర్జ, గాదెలవలస, చిన అంకలం, కాసాపేట గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. పెదంకలాంలో ఎంపీపీ బి.రవణమ్మ, లచ్చయ్యపేటలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం.. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బి. చిట్టిరాజు, నాయకులు ఈశ్వరనారాయణ, బి.శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పార్వతీపురం టౌన్: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



సాలూరు: బాగువలసలో వైఎస్సార్ వర్ధంతిలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు



పాచిపెంట: కోటికిపెంటలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు



పాచిపెంటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు



పార్వతీపురం టౌన్: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



బలిజిపేట: బలిజిపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్ వైఎస్సార్ అని నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు



లచ్చయ్యపేటలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ



సీతానగరం: పెదంకలాంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ రవణమ్మ



బలిజిపేట: అరసాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



సాలూరు: మామిడిపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



పాచిపెంట: గురువునాయుడుపేటలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం

క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న పీఎంయూ అధికారి ప్రకాశరావు

సాలూరు: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు-నేడు అభివృద్ధి పనులను నాడు-నేడు పీఎంయూ అధికారి కె.జె.ప్రకాశరావు శనివారం పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సూరినాయుడు, ఎంఈవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు



రహదారి ప్రాంతంలోని ఆక్రమణలను జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: స్థానిక పురపాలకసంఘ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు, రహదారుల ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణ శివారులోని నవిరి కాలనీలో రహదారిని ఆక్రమించి చేసిన కట్టడాలను జేసీబీలతో శనివారం తొలగించారు. పట్టణ ప్రధాన రహదారి ఇరువైపులా కాలువల ఆక్రమణలు గుర్తించామని, వాటిని తొలగించకుంటే ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ఆక్రమణలు తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలోని 16వ వార్డుకు చెందిన పండిత రాము ఆర్టీసీ డిపోలో పనిచేస్తూ ఇటీవల ప్రమాదవశాత్తు బస్సు ఢీకొన్న దుర్ఘటనలో మృతి చెందారు. ఈ మేరకు వైఎస్సార్ బీమా పథకం కింద బాధిత కుటుంబానికి మంజూరైన రూ.10 తక్షణసాయంను ఎమ్మెల్యే అలజంగి జోగారావు తన క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. మిగిలిన రూ.4.90 లక్షలను రెండు వారాల్లో అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ వానపల్లి శంకరరావు, కౌన్సిలర్లు సంగంరెడ్డి లక్ష్మీపార్వతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణ, తదితరులు

గరుగుబిల్లి: ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు విశాఖపట్నంలో రేడిసన్ హోటల్‌లో బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్న సందర్భంగా శనివారం తోటపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ మర్రాపు సత్యనారాయణతో పాటు కమిటీ మెంబర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. బ్యాంక్ అభివృద్ధికి, ఖాతాదారులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టెంపుల్ డెవలప్‌మెంట్ సేవా ట్రస్ట్ ట్రస్టీలు డి.ధనుంజయరావు, డి.పారినాయుడు తదితరులున్నారు.

108 సిబ్బంది రక్తదానం



ఏరియా ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న 108 సిబ్బంది

పాలకొండ రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా 108 సిబ్బంది నేతృత్వంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, 108 ఎంప్లాయీస్ అసోసియేషన్ వైఎస్సార్ టీయూసీ పర్యవేక్షణలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దివంగత వైఎస్సార్ మానస పుత్రిక అయిన 108 సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని సిబ్బంది తెలిపారు.

ఆస్పత్రుల అభివృద్ధికి ప్రాధాన్యం



జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ఆస్పత్రుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఆయన అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి సిబ్బంది సేవలను అభినందించారు. రోగులకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు నిత్యం రోగులకు అందుబాటులో సిబ్బంది ఉంటున్నారన్నారు. ఇదే స్ఫూర్తి కొనసాగిస్తూ సిబ్బంది మరింత బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆస్పత్రిలో గర్భిణులు, చిన్నారుల సంరక్షణకు ప్రత్యేక వార్డులతో పాటు కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అధునాతన సాంకేతిక పరికరాలతో కూడిన డయాలసిస్ సెంటర్, నెల తక్కువ చిన్నారులకు సైతం ప్రత్యేక ఎస్ఎన్‌సీయూలు అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో కన్నా ఆస్పత్రిలో సేవలు మెరుగయ్యాయన్నారు. అనంతరం ఆస్పత్రిలోని ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డాక్టర్ చిత్ర తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



పాపకు కృత్రిమ శ్వాస అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో సవర సరస్వతి అనే మహిళ శనివారం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తొలి కాన్పు కావడంతో పురిటి నొప్పులు వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురైంది. కాన్పు తర్వాత పాపలో కదలిక లేకపోవడాన్ని వైద్యులు గుర్తించారు. అంతేకాక పాప నీలిరంగులో మారడంతో అంతా ఆందోళన చెందారు. పాప పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో నవజాత శిశువు అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని పాప పరిస్థితిని 108 కాల్‌సెంటర్ డాక్టర్ శ్రీకాంత్‌కు వివరించారు. ఆయన సూచనలతో అంబులెన్స్‌లో బేబీని ఎక్కించి కృత్రిమ శ్వాసను అందించి శ్రీకాకుళం పయనమయ్యారు. మార్గమధ్యలో కొల్లివలస వద్దకు వచ్చేసరికి పాపలో కదలికలు వచ్చి ఏడవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌లోని చిన్నపిల్లల ఎమర్జెన్సీ వార్డులో చేర్పించారు. పాపకు కృత్రిమ శ్వాస అందించి ప్రాణాలు కాపాడిన అంబులెన్స్ సిబ్బంది గణపతి, మురళీలను తల్లిదండ్రులు, సీతంపేట ఆస్పత్రి వైద్యులు, రిమ్స్ వైద్యులు అభినందించారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయాలి

మక్కువ: జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని నగుళ్లదబ్బగెడ్డ గ్రామంలో శనివారం పర్యటించిన డీఈ సోమేశ్వరరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ సింహాచలం, ఏపీవో ఈశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. నిర్మాణాలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. నిర్మాణాలు చేపడుతున్న వారికి నిర్మాణ దశల వారీగా బిల్లుల చెల్లింపు సకాలంలో చేయడం జరుగుతోందని, అవసరమైతే రుణాలు కూడా ఇవ్వడం జరుగుతోందని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో లబ్ధిదారులంతా నిర్మాణాలు పూర్తి చేసి, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చాలన్నారు.

అర్హతే ప్రామాణికం..



పాలకొండ రూరల్: అంపిలి సచివాలయంలో అర్హులకు పింఛన్లు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: అర్హత ఉంటేచాలు సంక్షేమ లబ్ధి నేరుగా ఇంటి తలుపు తడుతుందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరావు అన్నారు. అంపిలి గ్రామ సచివాలయం పరిధిలో కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులకు శనివారం వైస్ ఎంపీపీ వాకముడి అనీల్‌కుమార్‌తో కలిసి పింఛన్ డబ్బులు అందజేశారు. అలాగే లుంబూరు, పనుకువలస, నవగాం గ్రామాల్లో సర్పంచులు తిర్లంగి ఉపేంద్రకుమార్, కోట మంజుభార్గవి, తొర్లపాటి నీరజ తదితరులు నూతన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అంతకుముందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బొత్స కుటుంబాన్ని విమర్శించే స్థాయి

సంధ్యారాణికి లేదు..

• డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను గానీ ఆయన కుటుంబాన్ని గానీ విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణికి గానీ, టీడీపీ నాయకులకు గానీ లేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించిన ఆయన కాసేపు మహానేత వైఎస్సార్ ఈ రాష్ట్రానికి చేసిన సేవలను తొలుత కొనియాడారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించి, మంత్రి బొత్సను విమర్శించే వారిపై మండిపడ్డారు. స్థాయిని మరిచి సంధ్యారాణి, టీడీపీ నేతలు మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బొత్స కుటుంబ దయాదాక్షిణ్యాలతోనే రాజకీయ ఓనమాలు నేర్చిన విషయం మర్చిపోయావా అని సంధ్యారాణిని ప్రశ్నించారు. ఇదే సాలూరు నడిబొడ్డున చంద్రబాబును నాడు సంధ్యారాణి ఎన్ని తిట్లు తిట్టారో మరిచిపోయారా అన్నారు. పార్టీలు మారినంత మాత్రాన నైతిక విలువలు మరిచిపోతే ఎలా అని హితవుపలికారు. ఎన్నికలకు నెల, వారం రోజులు ముందు పెద్దగెడ్డ, వంద పడకల ఆస్పత్రి, వంతెనల శంకుస్థాపనలు చేసిన టీడీపీ నాయకులు నేడు ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నా అధికార ప్రభుత్వంపై విమర్శలు చేయడం చాలా సిగ్గుచేటన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసమే బతికారు.. బతుకుతున్నారన్నారు. గతంలో టీడీపీ హయాంలో గిరిజనేత ప్రాంతానికి తరలివెళ్లిన కేంద్రీయ గిరిజన వర్సిటీ గురించి, కేంద్రంతో మాట్లాడి, గిరిజన ప్రాంతంలోనే గిరిజన వర్సిటీ ఏర్పాటు జరిగేలా సీఎం జగనన్న కృషి చేశారని, ఇటీవల దానికి సంబంధించి శంకుస్థాపన కూడా జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు నిరంతరాయంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఆయనదేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల వేళ టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను నమ్మవద్దని, అప్పటి టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలని ప్రజలను కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.